# విలువైన బహుమతి

రామమూర్తిగారు అప్పడే వచ్చిన కవరు విప్పతూ వుంటే, ఆయన భార్య సీతాలక్ష్మి వచ్చి పక్కనే కూచుంది.

"ఎవరి దగ్గరనుంచండీ ఉత్తరం

రామమూర్తిగారు సన్నగా నవ్వేరు. "ఏదీ ఇంకా ఉత్తరమైనా విప్పందే. పోనీ రోజూ నువ్వే పోస్టు తీసుకుని ముందుగా చదువుకో"

సీతాలక్ష్మి కొద్దిగా కోపాన్ని అభినయిస్తూ "ఉత్తరం చదవాలన్న ఆదుర్దా ఇద్దరికీ సమంగానే వుంటుంది. ఎవరి దగ్గరనుంచి అని అడగడమే తప్పై పోయింది" అంది.

రామమూర్తిగారు ఉత్తరం విప్పి "మురళీధర్ రాశాడోయ్. చాలా పెద్ద ఉత్తరమే రాసినట్లున్నాడే. విశేషమేదో ఉండి వుంటుంది" అన్నారు.

మురళీధర్ రామమూర్తిగారు మేనల్లుడు. అతని విద్యాభ్యాసమంతా రామమూర్తిగారింట్లోనే సాగింది. ఆయన మురళీధర్‌కి మేనమామ మాత్రమే కాదు, విద్యాగురువు కూడా.

"తొందరగా చదవండి" అన్న సీతాలక్ష్మి కోసం రామమూర్తిగారు ఉత్తరం పైకి చదవసాగారు. మామూలు క్షేమ సమాచారాల తర్వాత ఉత్తరమంతా తన కూతురు సౌమ్య గురించే రాశాడు మురళీధర్.

"మామయ్యా అందరమూ బాగానే వున్నాము కానీ సౌమ్య గురించి ఎందుకో, ఆందోళనగా వుంది. రాత్రి సరిగ్గా నిద్రపోవడం లేదు. విడిగా తన బెడ్రూంలో పడుకుంటే భయపడుతుందేమోనని మాగదిలోనే మంచంవేసి పడుకోబెడుతున్నాము. చదువు మీద శ్రద్ధ తగ్గింది. ఆటలకు వెళ్ళడం లేదు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడం లేదు. దేనికో కుమిలిపోతోంది. మాకు ఎంతగా ఆలోచించినా తన బాధ అర్థం కావడం లేదు. నేను కానీ, సరళకానీ తనని తిట్టలేదు. కొట్టలేదు.

ఇద్దరమూ ఉద్యోగాలు చెయ్యడం వల్ల తనని పట్టించుకోడంలేదని నువ్వు అనుకోవచ్చు. మా ఇద్దరినీ బాధ్యతగల ఉద్యోగాలే. ఇద్దరికీ ఆఫీస్ టెన్షన్లు వున్న మాటా వాస్తవమే.

అయినా ఇద్దరిలో ఎవరికి ఆఫీసులో రోజు బాగా గడుస్తుందో వాళ్ళు సౌమ్య

చదువు, భోజనం, ఆటల సంగతి చూసుకుంటాము. అందుకని సౌమ్యని నెగ్లెక్ట్ చేసే ప్రసక్తి లేదు. తన మానసిక ఆందోళనకి కారణం తెలియడం లేదు."

రామమూర్తిగారు చదువుతుంటే వింటున్న సీతాలక్ష్మి "మానసిక సమస్యలకీ డాక్టర్లుంటారుగా. వాళ్ళకి చూపించవచ్చును. మురళీధర్ పెద్ద సిటీలోనేగా వుండేది" అంది.

రామమూర్తిగారు "మురళీ ఆ విషయమే రాశాడు విను" అంటూ ఉత్తరం తిరిగి చదవసాగేరు.

"మా ఫ్యామిలీ డాక్టరుని కలిసి సౌమ్య విషయం చెప్పి మంచి సైక్రియాట్రిస్టు పేరు చెప్పమని అడిగేను. 'అంత చిన్నపిల్లని పెద్ద కారణమేమీ లేకుండా సైక్రియాట్రిస్టు దగ్గరకు తీసికెడితే తనలో ఏదో లోపముందని మరింతగా బెంబేలు పడవచ్చును. మీరే మెల్లిగా లాలించి విషయం తెలుసుకోండి' అన్నాడు. ఎంత ప్రయత్నించినా సౌమ్య మాకు ఏమీ చెప్పలేదు.

మామయ్యా, నీకు పిల్లలతో వున్న అనుబంధం నాకు తెలుసు. నన్ను పెంచింది నువ్వే కానీ మా అమ్మా, నాన్నా కాదుకదా. ఒక పదిరోజులు సెలవు పెట్టి నేనూ, సరళా సౌమ్యని నీ దగ్గరకు తీసుకొస్తాము. సౌమ్య మనస్సుని నువ్వు గ్రహించగలవని నా నమ్మకం. అత్తయ్యకు ఈ సంగతి చెప్పు. ఆవిడకు నా నమస్కారాలు. మేము ఎప్పుడు వస్తే నీకూ, అత్తయ్యకూ వీలవుతుందో లెటరు రాయి - నీ మురళీధర్ ఉత్తరం ఆసాంతం విన్న సీతాలక్ష్మి "ఎప్పుడు మనకి వీలవడమేమిటి? వాళ్ళకి ఎప్పుడు వీలయితే అప్పుడు రమ్మని రాయండి" అంది.

❖ ❖ ❖

వంటింట్లో జంతికలూ, కజ్జికాయలూ చేస్తున్న సీతాలక్ష్మితోరామమూర్తిగారు "చాలా హడావుడి చేసేస్తున్నావు. మురళీధర్ కుటుంబం వచ్చేది రేపు" అన్నారు.

"ఆ సంగతి నాకూ తెలుసు. ఇన్నాళ్ళకి ఇంట్లో మళ్లీ పిల్లలు తిరుగాడుతున్నారంటే నాకు ఎంత ఆనందంగా వుందో చెప్పలేను. మన పిల్లలిద్దరూ అమెరికాలోనే వున్నారాయె. నాలుగైదేళ్ళకోసారి కానీరారు. వాళ్ళ పిల్లలు ఇక్కడ చేసినవి ఇష్టంగా తిననూ తినరు. సౌమ్య మాత్రం మనవరాలు కాదా? ఇంతకీ ఆ పిల్ల మనస్సులో ఏముందో"

"మురళీధర్ ఇద్దరిలో ఎవరికి వీలైతే వాళ్ళము చూసుకుంటున్నామని రాశాడు కానీ అనుమానమే. మురళి పెద్ద కంపెనీలో మెయిన్‌టైన్సు ఇంజనీరు. సరళ రిసెర్చి

లాబ్స్‌లో సైంటిస్ట్. ఇద్దరూ తలనొప్పులతో ఇంటికొస్తారు. పిల్లనేం చూస్తారు?" అన్నారు రామమూర్తిగారు.

"సౌమ్యకి తమ్ముడో, చెల్లెలో వుంటే ఒంటరి తనం వుండేదికాదేమో. ఈ రోజుల్లో అందరూ ఒక్కరితో ఆపేస్తున్నారు. ఒకరికి ఒకరైనా తోడుండాలి" అన్నది సీతాలక్ష్మి.

"ఏ సంగతీ వాళ్లు వచ్చాకకానీ తెలియదు"

❖ ❖ ❖

మర్నాడు తల్లిదండ్రుల వెనుక బెరుగ్గా అడుగు పెడుతున్న సౌమ్యనుచూసిన రామమూర్తిగారూ, సీతాలక్ష్మీ స్థాణువుల్లా నిలిచిపోయారు. మూర్తీభవించిన విషాదంలా వుంది సౌమ్య.

సీతాలక్ష్మి ముందుగా తేరుకుని "రామ్మా సరళా, రాముఅళీధర్. నీ పేరేమిటి పాపా" అంటూ ముగ్గురినీ పలకరించింది.

రామమూర్తిగారు కూడా కుశలప్రశ్నలు వేశారు. సౌమ్య భయంగా లోపలకు వచ్చి తల్లి పక్కనే కూచుంది. ఒకటి, రెండు రోజులకి కానీ అలవాటుపడు అనుకుంది సీతాలక్ష్మి.

నలుగురూ కూచున్నాక మురళీధర్ విషయం చెప్పడం ప్రారంభించాడు.

"మీకు తెలుసు కదా మామయ్యా మా ఇద్దరివీ కూడా టెన్షన్ వున్న ఉద్యోగాలు. నిత్యం వర్కర్లతో పాట్లుపడి నేనూ, లాబరేటరీలో తల పగలగొట్టుకుని సరళా ఇంటికి వస్తాము. ఇకపై అధికారులతో గొడవలూ, ప్రమోషన్ల దగ్గర అన్యాయాలూ, కొలీగ్స్ చేసే మోసాలూ అన్నీ వుండేవే. మేమిద్దరమే వున్నప్పుడు ఏ ప్రాబ్లం లేదు. ఇంటికొచ్చాక ఆ రోజున జరిగిన నొప్పులు ఒకళ్లకి ఒకళ్లం చెప్పుకునే వాళ్లం. రాత్రి హాయిగా నిద్రపోయేవాళ్లం.

సౌమ్య పుట్టాకనే మాకు సాయంత్రాలు తీరిక లేకుండా పోయింది. ఆఫీసుల నుంచి ఇంటికి రాగానే సౌమ్యని ఆడించడం చెయ్యాల్సి వచ్చేది. ఆఫీసులో ఏదో విషయమై గొడవపడి ఇంటికి వచ్చాక ఆ చిరాకుని పిల్లమీద చూపించడం తప్పకదా. ఇద్దరం చర్చించుకుని ఒక నిర్ణయానికొచ్చాం. ఎవరికైతే రోజు బాగా గడుస్తుందో వాళ్ల సౌమ్య విషయం చూసుకోవాలి. ప్రతిరోజూ ఏ ఆఫీసులోనూ గొడవ వుండదు కదా. అందుకని ఇద్దరిలో ఎవరి మూడ్ బాగుంటే వాళ్ల సౌమ్యని చూసుకోడం, రెండోవాళ్ళు వాళ్ల తలనొప్పి వాళ్ళు తగ్గించుకోడం అని నిర్ణయించుకున్నాం. చిన్నప్పుడు

సౌమ్యని ఆడించడం స్కూల్లో చేర్చాక హోంవర్కు చేయించడం అలాగే చేస్తున్నాము. ఏర్పాటు బాగానే వుంది"

"ఇద్దరికీ ఒకేసారి ఆఫీసులో తలనొప్పి వస్తే" ప్రశ్నించింది సీతాలక్ష్మి

సరళ అందుకుని, "ఇంతవరకూ అలా కాలేదు. నాకు రావల్సిన ప్రమోషన్ ఇంకొకరికిచ్చారు. నేను చాలా దిగులుపడిపోయాను. కానీ ఆ సమయంలోనే ఆయనకు మెరిట్ ఇంక్రిమెంట్ ఇచ్చారు. దాంతో ఆయన ఉత్సాహంగా వుండి సౌమ్యను చూసుకున్నారు. అలాగే ఆయనకి బాస్‌తో గొడవ వచ్చినప్పుడు, నేను చాలా మంచి ఆఫీసర్‌కి రిపోర్ట్ చేసేదాన్ని. నన్ను చాలా సెమినార్లకి స్పాన్సర్ చేసేవారు కూడా. ఆ సమయంలో నేను ఉత్సాహంగా వుండి సౌమ్య బాధ్యత మొత్తం స్వీకరించాను.

ఇద్దరిలో ఒకళ్ళకి ఆనందం, ఒకళ్ళకి దిగులుగానే మా ఆఫీసులు నడుస్తున్నాయి. అందుకని లక్కీగా సౌమ్యని నెగ్లెక్ట్ చేసే ప్రసక్తి లేదు.

ఆదివారం వస్తే ఎవరమో ఒకళ్ళం సౌమ్యని బయటకు తీసికెడతాం" అంది.

"మేమిద్దరమూ తనని అంత బాగా చూసుకున్నా సౌమ్య ఎందుకో దిగాలుగా వుంటోంది. రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోవడం లేదు. చదువూ, ఆటలూ తగ్గిపోయాయి. నువ్వే విషయం తెలుసుకోవాలి మామయ్యా" అన్నాడు మురళీధర్.

"అలాగే ఒకటి రెండు రోజులు పోనియ్యి" అన్నారు రామమూర్తిగారు.

ఆ రాత్రి సరళా, మురళీధర్ వాళ్ళకోసం ప్రత్యేకించిన గదిలో కాకుండా దొడ్లో మంచాలమీదే నిద్రపోడం సీతాలక్ష్మికీ, రామమూర్తిగారికీ వింతగా అనిపించింది.

ప్రయాణపు బడలిక కాబోలు అని సరిపెట్టుకున్నారు.

❖ ❖ ❖

రెండు రోజులకి సౌమ్యకి రామమూర్తిగారి దగ్గరా, సీతాలక్ష్మి దగ్గరా అలవాటైంది. అమ్మమ్మా, తాతయ్యా అని పిలవడం నేర్చుకుంది.

"మురళీ, నువ్వు ఈ ఊరొస్తున్నావని తెలిసినప్పటి నుంచీ సీతాపతి మామయ్య నిన్ను చూడాలని ఒకటే తహతహలాడుతున్నాడురా. ఓసారి నువ్వూ, అమ్మాయీ వెళ్ళి చూసి రండి. ప్రొద్దుటే బయల్దేరి వెడితే పది గంటలకి వాళ్ళ ఊరు చేరుకోవచ్చు. సాయంత్రానికి వచ్చెయ్యండి" అన్నారు రామమూర్తిగారు.

"అలాగే రేపు ఉదయమే వెడతాం మామయ్యా. సౌమ్యా ఇంకో ఊరు వెడదాం వస్తావా?"

సౌమ్య సమాధానమిచ్చేలోగానే రామమూర్తిగారు అందుకుని "బస్సు ప్రయాణాలలో పిల్ల నలిగిపోతుంది. సౌమ్యని మా దగ్గరుంచేసి మీ ఇద్దరూ వెళ్లిరండి" అన్నారు.

సౌమ్యతో విడిగా మాట్లాడాలన్న రామమూర్తిగారి ఇంగితం గ్రహించిన మురళీధర్ "ఏం సౌమ్యా, నేనూ మమ్మీ రేపు ఊరు వెళ్లివస్తాము. నువ్విక్కడ వుంటావా" అని అడిగాడు.

"తప్పకుండా వుంటాను" అంటున్న సౌమ్య ముఖ్యంలో ఒక్క క్షణం ఆనందం మెరిసి, వెంటనే దిగులు అలుముకుంది.

చిన్నపిల్లల భావాలను చాలా బాగా చదవగలిగిన రామమూర్తి గారికి ఎంత ఆలోచించినా సౌమ్య మనస్సులోని ఊహలు తెలిసిరాలేదు.

❖ ❖ ❖

మర్నాడు మురళీధర్, సరళా ప్రొద్దుటే బయల్దేరి వెళ్ళారు. సౌమ్య ఏమీ మాట్లాడకుండా టాటా చెప్పింది.

బస్సెక్కుతున్న తల్లిదండ్రుల్ని చూస్తున్న సౌమ్య ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.

'తల్లిదండ్రులు వెడుతూంటే సంతోషిస్తున్నదేమిటి పిల్ల? సాధారణంగా పిల్లలు అమ్మా, నాన్నా ఎక్కడికైనా వెడుతుంటే ఏడుస్తారు. బహుశః మురళీధర్ కానీ, సరళకానీ పిల్లని ఎక్కువగా శిక్షిస్తున్నారేమో. వాళ్లకి అమ్మాయిని డిసిప్లిన్ చేస్తున్నామనే అనిపించవచ్చు, పిల్లకి ఇంకోలా వుండవచ్చు. మెల్లిగా విషయం రాబట్టాలి' అని తనలో అనుకుంటూ సౌమ్య ముఖంకేసి మళ్ళీ చూసిన రామమూర్తిగారు ఆశ్చర్యపోయారు.

ఆ అమ్మాయి ముఖమంతా దిగులుగా వుంది.

"ఏం సౌమ్యా అమ్మా, నాన్నా నిన్ను వదిలేసి వెడుతున్నారని ఏడుపొస్తోందా?"

"లేదు తాతయ్యా"

అంతకన్నా సౌమ్య మాట్లాడలేదు.

రామమూర్తిగారు రెట్టించలేదు.

❖ ❖ ❖

భోజనాలయ్యేదాకా సౌమ్య ఏమీ మాట్లాడలేదు. మధ్యాహ్నం వేళ సీతాలక్ష్మి సౌమ్యతో మాటలు కలపడానికి ప్రయత్నించింది.

"సౌమ్యా, నువ్వు ఇక్కడ ఆడుకుందుకు ఏమైనా బొమ్మలు తెచ్చుకున్నావా?"

"బిల్డింగ్‌సెట్ తెచ్చుకున్నాను"

"మరి ఆడుకోడం లేదేమి?"

"నాకు ఏం చెయ్యాలని లేదు"

"నాకు బిల్డింగ్‌సెట్‌తో ఎలా ఆడాలో చూపించు"

"బిల్డింగ్ సెట్‌తో ఆడరు. కుర్చీలు, సోఫాలు, ఉయ్యాల చెయ్యచ్చు"

"ఏదీ నాకు ఒక బొమ్మచేసి చూపించు"

సౌమ్య నిరుత్సాహంగా లోపలకు వెళ్ళి బిల్డింగ్ సెట్ తెచ్చి బ్లాక్స్‌తో సీ-సా చేసింది. పైకీ, కిందకీ ఊగుతున్న సీ-సాని చూస్తూ కుతూహలం ప్రదర్శించింది సీతాలక్ష్మి

"దీన్ని సీ-సా అంటారు. మా స్కూల్కో, పార్కులో, జూలో వుంటాయి. ఇటువైపు ఒకళ్ళూ, అటువైపు ఒకళ్ళూ కూచుంటారు. ఒకళ్ళు పైకి వెడితే, ఇంకొకళ్ళు కిందకి వెడతారు. పైకి వెళ్ళినవాళ్ళు హాపీగా ఉంటారు. కింద వున్నవాళ్ళు దిగులుగా వుంటారు. కాదు కాదు. హాపీగా వున్నవాళ్ళు పైకి వెడతారు. దిగులుగా వున్న వాళ్ళు కిందకి పోతారు. ఎవరైనా అంతే మా అమ్మా, నాన్నా అంతే"

సౌమ్య మాటలు రామమూర్తిగారి మనస్సుని ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేశాయి. చిన్నపిల్ల ఏం మాట్లాడుతుందో పూర్తిగా తెలియలేదు.

"పాపకు తాటాకు బొమ్మలు చెయ్యడం నేర్పించు" అన్నారాయన భార్యతో.

"ఈరోజుల్లో తాటాకు బొమ్మలూ, ముంజికాయలబళ్ళూ ఎవరికి కావాలి" అంటూనే ఆవిడ సౌమ్యకు బొమ్మ చేయడం నేర్పింది. సౌమ్య చురుగ్గా నేర్చుకుంది. మూడు బొమ్మలు చేసి అమ్మా, నాన్నా, సౌమ్యా అని పేర్లు పెట్టింది.

"బొమ్మల్ని సీ-సా మీద కూచోబెట్టి ఊగించు. చూస్తాను" అన్నారు రామమూర్తిగారు.

సౌమ్య అమ్మబొమ్మని ఒకవైపు, నాన్నబొమ్మని ఇంకోవైపూ పెట్టి, ఒక వైపు కిందకి నొక్కింది.

"మరి నువ్వు ఎక్కడ కూచుంటావు?"

సౌమ్య ఒక్క క్షణం ఆలోచించింది. "డాడీ హాపీగా వుండి పైకి వెళ్ళిపోతున్నప్పుడు నన్నూ తనతో తీసికెడతారు. పాపం మమ్మీ దిగులుగా కింద వుండి పోతుంది. నాకు బావుండదు".

"నువ్వేం చేస్తావు?"

"నేనూ దిగులుగా ఐపోతుంటాను. అప్పుడు మేమున్నవైపు కూడా కిందకు వచ్చేస్తుంది"

"మమ్మీ హాపీగా వుంటే..."

"అప్పుడు మమ్మీవైపు కూచుని దిగులుగా, బరువుగా అయిపోతాను."

సౌమ్య ఆలోచనల్లో పడిపోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు సౌమ్యా"

"నాకు పార్కులో సీ-సా ఆడడం ఇష్టంలేదు. బెంచీ మీద కూచోడం ఇష్టం" సౌమ్య మళ్ళీ దిగులుగా అయిపోయింది.

❖ ❖ ❖

రాత్రికి మురళీధర్, సరళా తిరిగివచ్చారు. సౌమ్య పడుకున్నాక రామమూర్తిగారు సీ-సా బొమ్మా, తాటాకు బొమ్మలూ పెట్టి ఆడసాగేరు.

"ఏమిటి మామయ్యా, సౌమ్య బదులు నువ్వే ఆడుతున్నావు?"

రామమూర్తిగారు చిరునవ్వు నవ్వి, సౌమ్య ఆ బొమ్మలతో ఎలా ఆడుకుందో, ఏం మాట్లాడిందో చెప్పారు.

"నాకు ఏం అర్థం కావడంలేదు మామయ్యా" మురళీధర్ అన్నాడు.

సరళ కూడా తనకు ఏమీ తెలియడం లేదన్నట్లుగా తల ఊపింది.

"చిన్నపిల్ల అయినప్పటికి సౌమ్య మీ ఇంట్లో పరిస్థితిని తన బొమ్మలతో వివరించింది. మీ ఇద్దరికీ ఉద్యోగాలున్నాయి. అక్కడ బాధ్యతలని చక్కగా నిర్వర్తిస్తున్నారు. ఇంట్లో పిల్ల బాధ్యతని కూడా ఎవరో ఒకరు స్వీకరిస్తున్నారు.

కానీ మీ ఇద్దరూ ఒకరి సంగతి ఒకరు పట్టించుకుంటున్నారా? మీ ఇద్దరికీ మధ్య దూరం పిల్లకి ఆనందమవుతుందా?

మురళీ, నువ్వు హాపీగా వున్నప్పుడు పిల్లకూడా నీతో సంతోషంగా వుండేలా చూస్తున్నావు. అయితే వాళ్ళ అమ్మ దిగులుగా వుంటే పిల్ల మనస్సు బాధపడదా? ఇంకా చెప్పాలంటే అమ్మ దిగులుగా వుంటే నాన్న సంతోషంగా వున్నాడన్న విషయం పిల్లని మరింత దిగులు పెడుతుంది.

అమ్మాయ్ సరళా, నీ విషయమైనా అంతే.

అమ్మా, నాన్నా ఒకరినొకరు పట్టించుకోరన్న సంగతి పిల్లని దిగులు పెడుతోంది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం లేదు. కాబోలు అనుకుంటోంది. ఆ సమయంలో తనేం చెయ్యాలి అని ఆలోచిస్తే తనూ దిగులుగా వుండడ మొక్కటే మార్గంగా తోచింది. అది తన ప్రేమను తెలియజేసే మార్గంగా సౌమ్య ఎన్నుకుంది. అందుకే ఆ పిల్ల ఎప్పుడూ దిగులుగా వుండి, చదువులో ఆటల్లో శ్రద్ధ పోగొట్టుకుని, నిద్రకు కూడా దూరమౌతోంది"

సరళా, మురళీధర్ అయోమయంగా చూశారు.

"మరి మమ్మల్ని ఏం చెయ్యమంటావు మామయ్యా మా ఇద్దరిలో దిగులు లేని వాళ్ళు కూడా ఏడవాలా" అన్నాడు మురళీధర్.

"అలా ఎందుకంటాను? సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే ఒక అరగంట మీకు మీరు కేటాయించుకుని ఒకరి కష్టం ఒకరికి చెప్పుకోండి. అప్పుడు మనస్సులు తేలికై ఇద్దరూ ఆనందంగానే వుండగలుగుతారు. ఆఫీసులలో సమస్యలు అందరికీ వుంటాయి. వాటిని ఒకరి సాయంతో ఒకరు పరిష్కరించుకోండి. ఆ తరువాత తేలికైన మనస్సులతో ఇద్దరూ సౌమ్యతో గడపండి. అప్పుడే ఆ అమ్మాయికి ఆనందంగా వుంటుంది. తల్లిదండ్రుల అఫీషియల్ టెన్షన్స్‌ని ఈకాలం పిల్లలు తప్పకుండా అర్థం చేసుకుంటారు. అఫీషియల్ మాత్రమే కాదు ఏకష్టమైనా వారికి తెలుస్తుంది.

పిల్లలు అసలు భరించలేనిదీ, అస్తమానం భయపడేదీ ఒక్కటే. అది తల్లిదండ్రులు ఒకరినొకరు పట్టించుకోకపోడం, వారి మధ్య అనుబంధం లేకపోవడమూను. తల్లిదండ్రుల మధ్యదూరం పిల్లలకీ సంతోషానికీ మధ్య దూరాన్ని పెంచుతుంది. మీ ఇద్దరిమధ్యా ప్రేమ వారి సుఖజీవితానికి పునాది"

మాట్లాడబోతున్న మురళీధర్‌ని ఆపుతూ రామమూర్తిగారన్నారు. "మా ఇద్దరి మధ్యా ప్రేమ వుందని నువ్వంటావు. సౌమ్య అలా అనుకోవడం లేదు. ఒకళ్ళ దుఃఖాన్ని రెండోవాళ్ళు పట్టించుకోకపోతే, తల్లిదండ్రులు సీ-సా పైకీ కిందకీ ఊగుతుంటే ఆ అమ్మాయి గుండె దుఃఖంవైపే ఊగుతోంది. మీ ఇద్దరూ కలిసి మెలిసి కష్టసుఖాలు పంచుకోవడమే ఆ అమ్మాయికి ఆనందం కానీ ఒకళ్ళని ఒకళ్ళు వదిలేసి తనను పెంచడం కాదు"

సరళా, మురళీధర్ అర్థమైనట్లు ఊపేరు. "ఈ సూత్రం అందరికీ వర్తిస్తుంది. ఉద్యోగాల వల్ల కాకపోతే ఇంకో కారణంగా దిగులు రావచ్చు భార్యాభర్తలు ఒక టీమ్‌గా వుండాలి. తల్లిదండ్రుల మధ్య పటిష్టమైన బంధమే పిల్లలకు అన్నిటికన్నా విలువైన బహుమతి"

(స్వాతి మంత్లీ)